క్లుప్తంగా

సీఎం జగన్ చొరవతో బాలిక చికిత్సకు ఏర్పాట్లు



తిరువూరు: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ వైద్య సహాయం కోసం ఎదురుచూస్తున్న ఒక బాలికకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భరోసా ఇచ్చారు. సోమవారం గుడివాడలో జరిగిన మేము సిద్ధం సభకు వెళ్లిన ఎ.కొండూరు మండలం పోలిశెట్టిపాడుకు చెందిన క్యాన్సర్ వ్యాధిగ్రస్తురాలైన బాలిక శ్రీవిద్యను తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు ముఖ్యమంత్రి వద్దకు తీసుకు వెళ్లారు. బాలికకు అత్యవసర వైద్య చికిత్స అవసరం ఉందని తెలియజేయగా.. వెంటనే ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశాలిచ్చారు. తమ కుమార్తె సమస్యపై వెంటనే స్పందించి వైద్య చికిత్సకు ఆదేశాలిచ్చినందుకు బాలిక తల్లిదండ్రులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి స్వామిదాసుకు కృతజ్ఞతలు తెలిపారు.

సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలి

ఇబ్రహీంపట్నం: కొండపల్లి, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లోని దుకాణదారులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సీఐ ఎం.సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల కాలంలో కంచికచర్ల, విస్సన్నపేట ప్రాంతాల్లోని బంగారం షాపుల్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన నేపథ్యంలో ఈప్రాంత దుకాణదారులను ఆయన అప్రమత్తం చేశారు. షాపుల వద్ద సీసీ కెమేరాలు, అలారం ఏర్పాటు చేసుకోవాలని, పటిష్టమైన తాళాలు, లాకర్లు ఏర్పాటు చేయడం వంటి భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. వాచ్‌మెన్‌లను నియమించుకోవాలని చెప్పారు. రాత్రివేళ లాకర్లలో బంగారు ఆభరణాలు వదలవద్దని సూచించారు. కొత్త వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

అమ్మజాన్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



ఎ.కొండూరు: మొహమ్మద్ ఖ్రమున్నీసా బేగం అమ్మజాన్ ఉరుసు గంధం మహోత్సవం ముగింపు కార్యక్రమంలో భాగంగా అమ్మజాన్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. వేమూరు మండలం జంపని గ్రామంలోని ఏపీ బీఎస్‌టీపీ దర్బార్ పీఠాధిపతి నిజాముద్దీన్ నిజామీ షా తాజ్ ఖాదరి పాల్గొని పూలు, గంధం, చాదర్ సమర్పించి ప్రార్థనలు చేశారు. పలువురు ముస్లిం మత పెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు.

మూడు బీరువాల బహూకరణ



గంపలగూడెం: గంపలగూడెం ముత్యాలమ్మ ఆలయం, భజన మందిరాలకు మూడు బీరువాలను గంపలగూడెంకు చెందిన కొల్లా నాగేశ్వరరావు జ్ఞాపకార్థం భార్య కృష్ణకుమారి, కుటుంబ సభ్యులు కమిటీ సభ్యులకు అందజేశారు. గంపలగూడెం ముత్యాలమ్మ ఆలయంలోని నాగేంద్రస్వామికి ఇత్తడి మకర తోరణాన్ని కూడా వీరు సమర్పించారు. భజన మందిరం నిర్వాహకులు చారుగుండ్ల చిన్న హనుమంతరావు, పులిపాటి గాంధీ, దాత కుటుంబీకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



విస్సన్నపేట: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక అపార్ట్ మెంట్‌లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి అధికారి బి. నానిక మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ వినియోగంలో మంటలు చెలరేగితే తీసుకోవాల్సిన చర్యలపై డెమో ద్వారా మహిళలకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

● కంచికచర్ల : అగ్నిప్రమాదాలు చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని కంచికచర్ల ఫైర్ అధికారి తలశిల శ్రీనివాసరావు అన్నారు. కంచికచర్ల జుజ్జూరు రోడ్డులోని ఓ అపార్ట్‌మెంట్ వద్ద మంగళవారం అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మాక్ డ్రిల్ నిర్వహించి, కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బి.శ్రీను, ఎస్‌కే తాజుద్దీన్, బి.సంజీవ్‌వర్మ, షేక్ సుభాని, శ్రీనివాసరావు, జి.రాజశేఖర్ పాల్గొన్నారు.

నామినేషన్ల పర్వానికి సర్వం సిద్ధం

- రేపటి నుంచి ప్రారంభం
- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరణ



నూజివీడులో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి భవానిశంకరి



ఏఆర్వోలు, సిబ్బందికి సూచనలిస్తున్న రిటర్నింగ్ అధికారి మాధవి

నూజివీడు: ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు సర్వం సిద్ధం చేశామని ఆర్డీఓ, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వై. భవానిశంకరి తెలిపారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ మే 13న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఈ నెల 25 వరకు నామినేషన్లు స్వీకరిస్తామని చెప్పారు. అభ్యర్థులు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల లోపు తమ నామినేషన్లను సమర్పించవచ్చన్నారు. ఈనెల 21న ఆదివారం సెలవు రోజు కాబట్టి నామినేషన్లు స్వీకరణ ఉండదన్నారు. నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి పొందవచ్చని చెప్పారు. నామినేషన్ పత్రంతో పాటు ఫారం-26 అఫిడవిట్‌ను జతపరచాలని, అభ్యర్థి నాలుగు స్టాంపు సైజ్ ఫొటోలను ఇవ్వాలని వివరించారు. ఓసీ, బీసీ అభ్యర్థులైతే రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీలైతే కుల ధ్రువీకరణ పత్రాన్ని సమర్పిస్తే రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. నగదు రూపంలో చెల్లించాల్సి ఉంటుందని, డీడీలు, చెక్‌లను అనుమతించమని తెలిపారు. అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్ దాఖలు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థి నామినేషన్ పత్రంలోని ప్రతి కాలమ్‌ను పూర్తి చేయాల్సి ఉంటుందని చెప్పారు. నామినేషన్ పత్రాలు నింపడంలో సలహాలు, సూచనలు అందించేందుకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశామని వివరించారు. రాజకీయ పార్టీల తరఫున పోటీ చేసే అభ్యర్థులు ఫారం-ఏ, ఫారం-బీలను నామినేషన్ల స్వీకరణకు చివరి రోజు మధ్యాహ్నం 3 గంటల లోగా అందజేయాలని, అలా అందజేయకపోతే స్వతంత్ర అభ్యర్థులుగా పరిగణిస్తామని చెప్పారు.

ఎన్నికల ఏర్పాట్లలో అధికారుల నిమగ్నం

తిరువూరు: నామినేషన్ల స్వీకార ఘట్టం గురువారం నుంచి ప్రారంభం కానుండటంతో ఏర్పాట్లు చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు. తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ, పరిశీలన తదితర కార్యక్రమాలను రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో నిర్వహిస్తారు. ఆర్డీఓ మాధవి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తుండగా తహసీల్దార్లు సహాయ రిటర్నింగ్ అధికారులుగా ఉంటారు.

ఏఆర్‌ఓలు, నామినేషన్ల స్వీకరణలో పాల్గొనే సిబ్బందికి మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో ఆమె శిక్షణ ఇచ్చారు. సెక్టోరల్ అధికారులు, ఎంసీసీ, ఎఫ్‌ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ విధులు నిర్వర్తించే సిబ్బందితో కూడా తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించి వారికి కేటాయించే విధులపై అవగాహన కల్పించారు. నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు, సహాయ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజాదరణ చూసి ఓర్వలేకే దాడులు

- నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు
- టీడీపీకి ఓటుతో గుణపాఠం చెప్పాలని పిలుపు



మొర్సపూడిలో ప్రచారం చేస్తున్న మేకా ప్రతాప్ అప్పారావు

నూజివీడు: ప్రజాక్షేత్రంలో సింహం లాంటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎవరూ ఏమీ చేయలేరని, అలాంటి సింహాన్ని దొంగచాటుగా దెబ్బతీయాలని చూస్తున్న టీడీపీకి ఓటుతో బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మొర్సపూడి, గొల్లపల్లిలలో మంగళవారం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు దాడులు చేయిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని, కూటమికి ఓటమి ఖాయమన్నారు. జగన్ పాలనలో రాష్ట్రంలోని ప్రజలు సుభిక్షంగా ఉన్నారని, గ్రామాలు అభివృద్ధి చెందాయని చెప్పారు. ప్రజలకు వైద్య సేవలు సైతం అందుబాటులోకి వచ్చాయన్నారు. నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తోందన్నారు. వివిధ పథకాలు అమలు చేసి పేదలకు బాసటగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిలిచారని వివరించారు.

రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించి జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు.

దాడి ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి జరగడం చిన్న విషయం కాదని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని, రాయి విసిరినంత మాత్రాన జగన్‌తో పాటు మాజీ మంత్రి వెల్లంపల్లికి గాయాలు కావని, ఇది పథకం ప్రకారం చేసిందేనన్నారు. టీడీపీ, జనసేన నాయకులు గులకరాయి అని అంటున్నారని, వాళ్లు అదే గులకరాయితో కొట్టించుకుంటారా? అని నిలదీశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, ఎంపీపీ ఆరేపల్లి శిరీష, సర్పంచ్‌లు శెట్టిపల్లి హరిరామకృష్ణ ప్రసాద్, మొర్సపూడి సొసైటీ అధ్యక్షుడు బెజవాడ రాజు, గొల్లపల్లి సర్పంచి బొకినాల వెంకటేశ్వరమ్మ, ఎంపీటీసీలు చల్లారి రేణుక ధనలక్ష్మి, తటకలూరి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభ్యున్నతికి సీఎం జగనన్న కృషి

సర్నాల తిరుపతిరావు



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న తిరుపతిరావు, గుండా సురేంద్ర తదితరులు

మైలవరం: గిరిజనుల అభ్యున్నతికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు అన్నారు. మైలవరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఎస్టీలతో ఆత్మీయ సమావేశం మైలవరం సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి అధ్యక్షతన మంగళవారం జరిగింది. తిరుపతిరావు మాట్లాడుతూ గిరిజనులను ఆర్థికంగా అభివృద్ధి చేయడం, విద్య, ఉపాధి అవకాశాలు కల్పించడం, రాజ్యాధికారం కల్పించి గిరిజనులను అభివృద్ధి చేయడమే సీఎం జగనన్న లక్ష్యమన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ గుండా సురేంద్ర మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని వివరించారు. గిరిజనులకు ప్రత్యేక కార్పొరేషన్ కూడా ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ ఎస్సీ సెల్ రీజినల్ కో-ఆర్డినేటర్ చిరంజీవి మాట్లాడుతూ బీసీ వర్గానికి చెందిన సర్నాల తిరుపతిరావును గెలిపించి ముఖ్యమంత్రి జగనన్నకు బహుమతిగా ఇవ్వాలన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక..

ఈ సందర్భంగా కొండపల్లి నుంచి టీడీపీకి చెందిన 10 కుటుంబాల వారు తిరుపతిరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి గిరిజనులు పాల్గొన్నారు.

కొండపల్లిలో 21మంది వలంటీర్ల రాజీనామా

ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాల్టీలోని 1, 3 వార్డు సచివాలయాలలో పనిచేస్తున్న 21 మంది వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీఓ ఉమాదేవికి అందజేశారు.

● చాట్రాయి: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 13 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. మంగళవారం ఎంపీడీఓ మంగా కుమారికి రాజీనామా పత్రాలు అందజేవారు. ప్రతిపక్ష నాయకులు మాపై చేస్తున్న ఆరోపణలకు మనస్థాపానికి గురై రాజీనామాలు చేస్తున్నట్లు వలంటీర్లు తెలిపారు.

● విస్సన్నపేట: మండలంలోని పుట్రేల 1, 2, కలగర గ్రామ సచివాలయాలలో పని చేస్తున్న గ్రామ వలంటీర్లు ఆరుగురు స్వచ్ఛందగా రాజీనామా చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ జి. విజయ కుమారికి రాజీనామా పత్రాలను అందజేశారు.

● ముసునూరు: కాట్రేనిపాడు, వేల్పుచర్ల, సూరేపల్లి, ముసునూరు-2 తదితర గ్రామ సచివాలయాలకు చెందిన 10 మంది గ్రామ వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. రాజీమానా పత్రాలను ఎంపీడీఓ చాగంటి పద్మావతీదేవికి అందజేశారు.

● ఆగిరిపల్లి: వట్టిగుడిపాడు, తోటపల్లి, ఎస్‌ఏపేట, చొప్పరమెట్ల, కొత్త ఈదర, సచివాలయాలకు చెందిన 67 మంది వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

గంపలగూడెం: బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల అనేక అనర్థాలను బాలికలు ఎదుర్కోవాల్సి వస్తోందని గంపలగూడెం పీహెచ్‌సీ వైద్యులు భార్గవి అన్నారు. గంపలగూడెం సచివాలయంలో మంగళవారం బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. బాలికలు సంపూర్ణ అక్షరాస్యత సాధించాల్సి ఉందన్నారు. తద్వారా అనేక సమస్యలను స్వతహాగా ఎదురుకోవడంతో పాటు, చట్టాలపై అవగాహన పెరుగుతుందని చెప్పారు. వేసవిలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రేవతి, మునిలక్ష్మి, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి



గంపలగూడెంలో ప్రచారం నిర్వహిస్తున్న నల్లగట్ల సుధారాణి



కూనపరాజుపర్వ గ్రామంలో ప్రచారం చేస్తున్న విజయభాస్కరరెడ్డి తదితరులు

రెడ్డిగూడెం: వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని), మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావును గెలిపించాలని జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రెడ్డిగూడెం మండలం కూనపరాజుపర్వ గ్రామంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. సర్పంచ్ మాతంగి వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ తోటకూర రవి, వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● గంపలగూడెం: మే 13న జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి కోరారు.స్థానిక నాయకులతో కలిసి మంగళవారం ఆమె గంపలగూడెం తూర్పు దళితవాడలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పేద ప్రజల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలు ముమ్ముందు అమలు జరగాలంటే ఓటర్లు వైఎస్సార్‌సీపీకి మరోమారు అధికారం అప్పగించాలని కోరారు. విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసులను గెలిపించాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

21న ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి పరీక్ష

రెడ్డిగూడెం: మండలంలోని మద్దులపర్వ ఆదర్శపాఠశాలలో ఈనెల 21న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఆరో తరగతి ప్రవేశ పరీక్ష జరుగుతుందని ప్రిన్సిపాల్ వీర్రాజు మంగళవారం తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులందరూ హాల్ టికెట్లను (www.cse.ap.gov.in) డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. ఈ పరీక్ష ఐదో తరగతి స్థాయిలో ఉంటుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ వీర్రాజు తెలిపారు. ఇతర వివరాలకు సెల్: 70757 73456, 82475 52027 నంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు శ్రీరామ నవమి

చాట్రాయి: చనుబండ గ్రామంలోని కోదండ రామాలయంలో బుధవారం నిర్వహించే శ్రీరామ నవమికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ఉదయం నిర్వహించే సీతారామ కల్యాణాన్ని తిలకించేందుకు వేలాది మంది భక్తులు తరలి రానున్నందున కల్యాణ మండపం ముందు షామియానా, కుర్చీలు, తాగు నీరు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

చికిత్స పొందుతూ కార్మికురాలు మృతి

ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ డిపోలో ఈనెల 9వ తేదీన విధి నిర్వహణలో విద్యుదాఘాతానికి గురైన కాంట్రాక్ట్ కార్మికురాలు సాలి మేరి (45) ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. మేరి కుటుంబానికి న్యాయం చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకులు డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యం, కాంట్రాక్టర్ రామకృష్ణతో చర్చలు జరిపారు. ఆమె కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.25 వేలు ఆర్థిక సహాయం కుటుంబ సభ్యులకు అందజేశారు.

వీరేశలింగం పంతులుకు నివాళి

పెనుగొలను(గంపలగూడెం): గంపలగూడెం మండలం పెనుగొలనులో మంగళవారం షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో సంఘ సంస్కర్త, రచయిత కందుకూరి వీరేశలింగం జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీరేశలింగం అనేక గొప్ప రచనలు రాసి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని, బాల్య వివాహాలు, సతీ సహగమనం, వరకట్నానికి వ్యతిరేకంగా పోరాడి మహిళ విద్యను, వితంతువుల పునర్వివాహాన్ని ప్రోత్సహించి పలువురికి ఆదర్శంగా నిలిచారని సేవా కమిటీ సభ్యులు కొనియాడారు. వీరేశలింగం జన్మదినాన్ని తెలుగు నాటకరంగ దినోత్సవంగా ప్రభుత్వం నిర్ణయించిందని, తెలుగులో తొలి నవల రాసింది కూడా వీరేనని వారు వివరించారు. ఎలిమెంటరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏవీ నరసింహారావు, గ్రంథాలయ నిర్వాహకులు జె. శ్రీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే సంక్షేమం, అభివృద్ధి

మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తిరుపతిరావు



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న తిరుపతిరావు

మైలవరం: వైఎస్సార్ సీపీని తిరిగి అధికారంలోకి తీసుకువస్తేనే రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, రాష్ట్రం అభివృద్ధిపథంలో పయనిస్తుందని వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు అన్నారు. మైలవరం బాలయోగి నగర్‌లో మంగళవారం ఆయన ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. తిరుపతిరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా మళ్లీ జగనన్నను, ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. స్థానికుడైన తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. స్థానిక సమస్యలపై అవగాహన కలిగి ఉన్నానని, ఇక్కడే ఉంటానని, అందరి వాడినని, అందరికీ అందుబాటులో ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌కు చేరిన ఈవీఎంలు

నూజివీడు: మే 13న జరుగనున్న సార్వత్రిక ఎన్నికలకు గాను అవసరమైన ఈవీఎంలను పట్టణంలోని సారథి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచామని రిటర్నింగ్ అధికారి వై. భవానీశంకరి తెలిపారు. నియోజకవర్గంలో 286 పోలింగ్ స్టేషన్లు ఉండగా ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలను అవసరమైన వాటి కంటే 20 శాతం అదనంగా వచ్చాయని, అలాగే వీవీ ప్యాట్‌లు కావాల్సిన వాటి కంటే 30 శాతం అదనంగా వచ్చాయని, వాటిని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచామని చెప్పారు.

వీఆర్వోలతో సమీక్ష

జుజ్జూరు(వీరులపాడు): వీఆర్వోలు ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని తహసీల్దార్ రాజాకిషోర్ ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాలన్నారు. డెప్యూటీ తహసీల్దార్ అంజనేయులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

మద్యం, సారా విక్రేతల అరెస్ట్



తిరువూరు: తిరువూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో మద్యం, సారా విక్రయిస్తున్న ముగ్గురిని మంగళవారం అధికారులు అరెస్ట్ చేశారు. విస్సన్నపేట మండలం కొండపర్వలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వలివెల రాధాకృష్ణ నుంచి 10 మద్యం సీసాలు, పంది రాజ్యలక్ష్మి నుంచి 12 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఎ.కొండూరు మండలం కుమ్మరికుంట్ల తండాలో గుగులోతు జంప్లి నుంచి ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ల ఎదుట హాజరుపరచామని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

తిరువూరు: స్థానిక సుగాలీ కాలనీలో ఓ వ్యక్తి నెల కిందట అదృశ్యమయ్యాడు. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గుగులోతు గోపీకృష్ణ హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ ఇటీవల తిరువూరు వచ్చాడు. తన తల్లిదండ్రుల వద్ద ఉంటూ డీఆర్‌డీఏలో కాంట్రాక్టు ప్రాతిపదికన జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. గత నెల 14న ఇంటి నుంచి వెళ్లిన గోపీకృష్ణ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతని ఆచూకీకై గాలించారు. అతని ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం అతని తండ్రి పీక్యా నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

తిరువూరు: తెలంగాణ రాష్ట్రం నుంచి కొనుగోలు చేసిన మద్యం సీసాలను ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న ఓ వ్యక్తిని తిరువూరు పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం..స్థానిక సరిహద్దు చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా విజయవాడకు చెందిన సీహెచ్ రమేష్ బ్యాగులో తెలంగాణ మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.